రికార్డ్ స్థాయిలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు

- 8,378 కేంద్రాల ద్వారా 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 2023తో పోలిస్తే 13 లక్షల మెట్రిక్ టన్నులు అధికం
- 12.33 లక్షల మంది రైతులకు రూ.15,121 కోట్ల చెల్లింపులు : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి సంచలన రికార్డు నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పాలనతో పోల్చుకుంటే సరిగ్గా జూన్ ఎనిమిది నాటికి అధికంగా 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఆయన వెల్లడించారు. సోమవారం ధాన్యం కొనుగోళ్ల విషయంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. బిఆర్ఎస్ పాలన చివరి రోజుల్లో అంటే సరిగ్గా జూన్ ఎనిమిది నాటికి నాటి ప్రభుత్వం 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. వానాకాలం సీజన్‌లో రికార్డు స్థాయిలో దిగుబడి అయిన ధాన్యాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు ఆయిన విస్తీర్ణాన్ని దృష్టిలో పెట్టుకున్నట్టు చెప్పారు. అదనంగా 1,344 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను చేపట్టిందని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేసిన 12.33 లక్షల మంది రైతులకు ప్రస్తుత ప్రభుత్వం రూ.15,121 కోట్ల రూపాయలను చెల్లించినట్టు తెలిపారు. అదే గత యాసంగి సీజన్‌లో అప్పటి ప్రభుత్వం 9.81 లక్షల మంది రైతుల దగ్గర ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.5,982 కోట్లు చెల్లించిందని గుర్తుచేశారు. చెల్లింపులోనూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాసంగి సీజన్‌లో జూన్ ఎనిమిది నాటికి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రస్తుత ప్రభుత్వం రూ.9,139 కోట్లు అధికంగా చెల్లించామన్నారు. బీఆర్ఎస్ పాలకులు గొప్పగా చెప్పుకునే కాళేశ్వరం నిరుపయోగంగా మారినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి చేసుకోవడం వ్యవసాయ చరిత్రలోనే చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు.

పెంచిన బస్‌పాస్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెంచిన బస్‌పాస్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ ప్రజల, విద్యార్థుల బస్‌పాసులను 20శాతానికిపైగా పెంచి ప్రయాణీకులపై విపరీతమైన భారం మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే ఒక్కో ప్రయాణీకునిపై ప్రతి నెలా రు.250 నుండి 300ల వరకు భారం పడుతోందని పేర్కొన్నారు. పేదలు ప్రయాణించే ఆర్‌టిసి బస్సుల్లో ఇంత పెద్దఎత్తున ఛార్జీలు పెంచడం ప్రభుత్వానికి, టీజీ ఆర్టీసీ సంస్థకు తగదని పేర్కొన్నారు. తక్షణమే పెంచిన బస్‌పాస్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు మహలక్ష్మి పేరుతో ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణమంటూనే బస్సుల్లో ప్రయాణించి చిన్నచిన్న పనులు చేసుకునే వారిపై ఈ ఛార్జీల భారం మోపడం తగదని హితవు పలికారు. దీంతో ఇప్పటికే నిత్యావసర ధరలతో సతమతమవుతున్న పేద కుటుంబాలపై అదనపు భారం పడుతుందని తెలిపారు. ఒక వైపు మహిళలకు ఉచిత ప్రయాణమంటూ మరో వైపసు బస్‌పాస్ ఛార్జీలను పెంచడమంటే ఒకచేత్తో ఇచ్చినట్టే ఇచ్చి, మరోచేత్తో అందినంత దోచుకోవడమేనని విమర్శించారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- కమిషనర్‌కు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కమిషనర్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, మహిళా కూలీ రాష్ట్ర కన్వీనర్ బి పద్మ, రాష్ట్ర కార్యదర్శి కె జగన్ వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణ పేదలకు ఉపాధి పని విస్తరింప చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత మూడు నుండి నాలుగు నెలల నుంచి కార్మికుల వేతనాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు పెట్టుకున్న వారికి కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం లేదని గుర్తు చేశారు. ఆయా కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు చేసుకునే అవకాశం లేకపోవటంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అనేకమంది పనికి దూరమవుతున్నారని తెలిపారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవని, పే స్లిప్పు ఇవ్వడం లేదని, సమ్మర్ అలవెన్స్ అమలు కావడం లేదని గుర్తు చేశారు. మంచినీరు అందించడం లేదని, అనేక గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల పేదలకు ఉపాధి పని విస్తరింప జేసి 150 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజు కూలి రూ.400 అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కులం పేరుతో దూషణ

- మనస్తాపంతో బాలుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులం పేరుతో దూషిస్తూ ఇష్టం వచ్చినట్టు కర్రతో కొట్టడంతో మనస్తాపానికి గురై బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కొండాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ.. జల్లి శ్రీకాంత్, పత్రి అశోక్‌లను మేకను కోయడానికి పిలిచింది. వారు మేకను కోసిన చేతులకు అంటిన రక్తాన్ని నీటి తొట్టిలో కడుకున్నారు. అయితే జల్లి శ్రీకాంత్ (14)ను బూతులు తిడుతూ, కులం పేరుతో దూషిస్తూ ఇష్టం వచ్చినట్టుగా ఆ మహిళ కర్రతో కొట్టింది. దీంతో బాలుడు మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. తల్లి, ఇద్దరు అక్కలు ఉన్నారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కోల కొమరమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

జాన్‌వెస్లీ అరెస్టుకు సిపిఎం ఖండన

ఇథనాల్ కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద దన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 12 గ్రామాల రైతులు, రిమాండ్‌లో ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు సోమవారం ఆ గ్రామానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్, గద్వాల జిల్లా కార్యదర్శి ఎ వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు వెంబడించి, మధ్యలోనే అడ్డుకుని వారిని అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్రకమిటీ తీవ్రంగా ఖండించింది. గత వారం రోజులుగా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించింది. మరియమ్మ అనే దళిత మహిళను పోలీసులు తీవ్రంగా కొట్టడమే కాకుండా, 46 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి నిర్బంధాలు రాష్ట్ర ప్రభుత్వానికి తగదని హెచ్చరించింది. గతంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అనేక ఆందోళనలు చేసిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే నియంతృత్వంగా వ్యవహరిస్తూ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకోవడం దుర్మార్గమని విమర్శించింది. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల పంట పొలాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇథనాల్ కంపెనీ నిర్మాణాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. జైల్లో పెట్టిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని కోరింది. గ్రామాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఎత్తేసి, అక్రమ అరెస్టులను ఆపాలనీ, మరియమ్మపై దాడిచేసిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మంత్రి దామోదర్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కేరాఫ్‌గా నిలిచిందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని దామోదర రాజనర్సింహ నివాసంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర అడ్లూరిని అభినందించి ఆశీర్వదించారు. మంత్రిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎస్‌సి వర్గీకరణ, కుల గుణన, బిసిల రిజర్వేషన్ల పెంపు, మంత్రివర్గంలో నలుగురు ఎస్‌సిలకు స్థానం కల్పించడం, స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం వంటి అంశాలను ఇద్దరు మంత్రులు గుర్తు చేసుకున్నారు.

త్వరలో బాల భరోసా పథకం

- ఐదేళ్ల లోపు చిన్నారులకు అన్నిరకాల వైద్య పరీక్షలు
- అవసరమైతే శస్త్రచికిత్సలూ ఉచితంగా చేయిస్తాం
- మహిళలను ఆర్థిక బలోపేతం చేయడమే లక్ష్యం : మంత్రి సీతక్క

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బాల భరోసా పేరుతో కొత్త పథకం తీసుకురాబోతున్నామనీ, ఐదేండ్ల లోపు చిన్నారులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ ప్రకటించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేయిస్తామని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఏర్పాటు చేయించడం, కొత్త మహిళ సభ్యుల గుర్తింపు, కిశోర బాలికలు, దివ్యాంగులు, వయోధిక మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల పురోగతి, మహిళా సంఘాలతో ప్రభుత్వ పాఠశాలల స్కూల్ యూనిఫాంలు కుట్టించడం, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, పిఆర్ఆర్‌డి డైరెక్టర్ సృజన, మహిళా శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ పర్సన్ సాధికార శాఖ డైరెక్టర్ శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 సాకారంలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించేలా కృషిచేయాలనీ, వాటికి అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించాలని సూచించారు. అక్టోబర్ రెండోతేదీన సోలార్ ప్లాంట్లు ప్రారంభించే లక్ష్యంతో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కంపెనీలతో సమన్వయం చేసుకుని సోలార్ ప్లాంట్ల పనులను ప్రారంభించాలని సూచించారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను నవంబర్ లోపు పూర్తి చేయాలని నొక్కిచెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు బాగుంటేనే పేద పిల్లలకు ఉపయోగమనీ, వాటిమీద ఫోకస్ పెట్టాలని సూచించారు. 90 శాతం యూనిఫాం కుట్టుపనులు పూర్తయ్యాయని చెప్పారు. బుధవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలెక్టర్లంతా వాటి నిర్వహణ ఎలా ఉందో చెక్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీలను ప్రయివేటు ప్లే స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దాలన్నారు. కొత్తగా నిర్మించబోయే 1000 అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాలను సేకరించాలన్నారు. అర్హులైన ప్రతి మహిళా ఎస్‌హెచ్‌జీలో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగుల ధ్రువీకరణ పత్రాల కోసం 38 ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ...ఇందిరా మహిళా శక్తి పాలసీ అత్యంత కీలకమైనదని నొక్కి చెప్పారు. 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండేలా చూడాలన్నారు. ఓటర్ లిస్టు తీసుకుని నూతన సభ్యులను గుర్తించాలని సూచించారు. పట్టణ మహిళలు, దివ్యాంగులు, వయోధికులతో ప్రత్యేక మహిళా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసేలా కలెక్టర్లు చొరవ చూపాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి పథకంపై సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

దళితుల పక్షాన నిలిచిన సిఎం రేవంత్ రెడ్డి : ప్రీతమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభినవ అంబేద్కర్‌లాగా సిఎం రేవంత్ రెడ్డి దళితల పక్షాన నిలిచారని దళిత కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ కొనియాడారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ ఏ ర్పాటుతో దళిత, గిరిజనులకు స్వేచ్ఛగా గాలి పీల్చే అవకాశం లభించిందన్నారు. అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లను క్యాబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా సాధారణ కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గౌరవమని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దళితుల గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. స్వరాష్ట్ర సాధనలో దళితులు, గిరిజనులు పోరాడిన త్యాగాలకు కాంగ్రెస్ స్ఫూర్తిదాయక గౌరవమిదన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఎస్సీల భూములను పార్టీ కార్యాలయాల కోసం కేటాయించడం చిన్నచూపు చూసిందని ఉదహరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌ను నియమించి దళితులను గౌరవించిందని గుర్తుచేశారు. దళితుడిని డిప్యూటీ సీఎం, ఫైనాన్స్ మినిస్టర్‌గా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు. దళితులకు గౌరవస్థానం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో ప్రత్యేక స్థానముందన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో లేని విధంగా కాస్మోటిక్ చార్జీలు 50 శాతం మెస్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. 50 చోట్ల రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డిదేనని తెలిపారు. ఎస్‌సిల సుదీర్ఘ 30 ఏళ్ల కళ ఎస్‌సి వర్గీకరణను ఒక్క సంతకంతో పూర్తి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ దుష్ప్రచారం మానేసి అభివృద్ధిపై చర్చకు రావాలని సూచించారు. ఎంగిలి మెతులకు ఆశపడి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మిగిలిన క్యాబినెట్ బెర్త్‌లతో పాటు కార్పొరేషన్ చైర్మన్లలో బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డిని బలపరిచే విధంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుట్టబోతున్నట్టు ప్రకటించారు.

ఐసెట్‌కు 90.51 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆది, సోమవారాల్లో నిర్వహించిన ఐసెట్ రాతపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ మేరకు ఐసెట్ కన్వీనర్ అలువాల రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసెట్‌కు 71,757 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 64,938 (90.51 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఈనెల 21న ప్రాథమిక కీని విడుదల చేస్తామని తెలిపారు. 26 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://icet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలను ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ఇటికాల పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎంజియు విసి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఉన్నత విద్యామండలి కో ఆర్డినేటర్ రమేష్ కుమార్ మిరియాల తదితరులు పర్యవేక్షించారని తెలిపారు.

గురుకులాల పనివేళల మార్పునకు ప్రభుత్వం అంగీకారం

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల పనివేళల మార్పునకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు అజిత్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సీఎం ఆదేశాల మేరకు త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా తగు ఉత్తర్వులను విడుదల చేయనున్నట్టు హామీ ఇచ్చారని తెలిపారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలనీ, హెల్త్ కార్డులు ఇవ్వాలని, గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. గురుకుల పాఠశాలల ఉమ్మడి డైరెక్టరేట్, తాత్కాలిక ఉద్యోగులకు 12 నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. ఆ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామంటూ వారు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, గురుకుల ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందదంటూ సిఎంఒ, విద్యాశాఖ అధికారులు చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పిఆర్‌జిటిఎ బాధ్యులు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి, ఉప్ప అశోక్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను సర్దుబాటు చేయండి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎస్‌జిటియు బృందం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లను సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్‌జిటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డికి వారి నేతృత్వంలోని ఎస్‌జిటియు బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ..జులై 31 వరకు జరిగే విద్యార్థుల నమోదు ప్రక్రియను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్ హామీనిచ్చారని తెలిపారు.

దళిత యువకుడికి న్యాయం చేయాలి

- పెత్తందారులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- తాండూరు డిఎస్‌పిని సస్పెండ్ చేయాలి
- డిఎస్‌పి కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాండూరు పోలీసు అధికారులు పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని దళిత, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. దళిత యువకుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాండూర్ డిఎస్‌పిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బెల్కటూర్ దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. వికారాబాద్ జిల్లా తాండూర్ డిఎస్‌పి కార్యాలయాన్ని దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. ముందుగా స్థానిక బస్టాండ్ నుంచి డిఎస్‌పి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాండూర్ మండలం బెల్కటూర్ గ్రామంలో మే నెల 18న దళిత యువకుడు వినయ్‌కుమార్ పెండ్లి బరాత్‌ను అగ్రకులస్తులు అడ్డుకున్నారని తెలిపారు. అంతటితో ఆగకుండా వారిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. కులం పేరుతో దూషిస్తూ.. తమ వాడలో బరాత్ తీస్తారా అంటూ బెదిరించినట్టు తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సొంత గ్రామంలో ఇలాంటి ఘటన జరగడం విచారకరం అన్నారు. బాధితులకు న్యాయం చేయాలని, నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేసినా డిఎస్‌పి పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఘటనపై కలెక్టర్, ఎస్‌పి స్పందించి, బాధ్యులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తూరు చంద్రయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు సురేష్, సిఐటియు మండల నాయకులు సురేష్, ఇతర ప్రజాసంఘాల నాయకులు నవీన్, నగేష్, ఆనంద్, అశోక్, ప్రవీణ్, ఎం నవీన్‌కుమార్, మధు, బిచ్చప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్‌పాస్ రేట్లు పెంపు

- 20 నుంచి 50 శాతం వరకు పెరుగుదల

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి) బస్‌పాస్ ఛార్జీలను పెంచింది. సాధారణ ప్రజలతో పాటు, స్టూడెంట్ పాస్ ధరలను పెంచింది. తక్షణం పెరిగిన బస్‌పాస్ ఛార్జీలు అమల్లోకి వస్తాయని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని రకాల బస్‌పాసులపై 20 శాతానికి పైగా రేట్లను పెంచారు. ప్రస్తుతం రూ.1,150 ఉన్న జనరల్ ఆర్డినరీ బస్‌పాస్ ధరను రూ.1,400కు (పెంపు 21.74 శాతం) పెంచారు. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ ధరను రూ.1,600కు (23.08 శాతం) పెంచారు. రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను రూ.1,800కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఎసి పాస్ ధరలను కూడా భారీగా పెంచేశారు. ఎన్‌జిఓలు, ఆర్‌టిసి ఉద్యోగుల పిల్లలకు ఇచ్చే బస్‌పాస్ ధరలు కూడా పెరిగాయి.

12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం

- వచ్చే ఏడాది ఏప్రిల్ 23 చివరి పనిదినం
- పాఠశాలల అకడమిక్ కేలెండర్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని ప్రభుత్వం వెల్లడించింది. పాఠశాలల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచే తరగతులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే జయశంకర్ బడిబాట ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 19 వరకు కొనసాగనుంది. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలలకు మొత్తం 230 పనిదినాలుంటాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 పాఠశాలలకు చివరి పనిదినం. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పాఠశాలల అకడమిక్ క్యాలెండర్‌ను సోమవారం విడుదల చేశారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది జనవరి పదో తేదీ వరకు పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 28 నాటికి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో ప్రార్థన (అసెంబ్లీ) ముగిసిన తర్వాత ప్రతిరోజూ ఐదు నిమిషాలపాటు యోగా, ధ్యానం చేయాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరంలో బ్యాగ్‌లేని రోజులు పది ఉంటాయని వివరించారు. ప్రతినెల మూడో శనివారం తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం (పిటిఎం) నిర్వహించాలని, గ్రీన్ అవర్, బాలసభ జరపాలనీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఎఎపిసి) సభ్యులను ఆహ్వానించాలని సూచించారు.

జులై 31 నాటికి ఎఫ్ఎ-1 పరీక్షలు

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు జులై 31 నాటికి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎ-1) పరీక్షలను నిర్వహించాలని యోగితా రాణా తెలిపారు. సెప్టెంబర్ 30 నాటికి ఎఫ్ఎ-2 పరీక్షలు జరపాలని పేర్కొన్నారు. అక్టోబర్ 24 నుంచి 31 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఎ-1) పరీక్షలుంటాయని వివరించారు. డిసెంబర్ 23 నాటికి ఎఫ్ఎ-3 పరీక్షలుంటాయని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడు నాటికి పదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఎ-4 పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 నాటికి ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఎ-4 పరీక్షలుంటాయని వివరించారు. ఏప్రిల్ పది నుంచి 18 వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్ఎ-2 పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీలోపు పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను జరుపుతామని పేర్కొన్నారు. మార్చిలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలుంటాయని వివరించారు.

సెప్టెంబర్ 26 నాటికి రాష్ట్రస్థాయి క్రీడలను పూర్తి చేయాలి

ఈ ఏడాది సెప్టెంబర్ 26 నాటికి రాష్ట్రస్థాయిలో క్రీడలను పూర్తి చేయాలని యోగితారాణా ఆదేశించారు. అక్టోబర్‌లో జాతీయ స్థాయిలో క్రీడలుంటాయని వివరించారు. ఆగస్టు మొదటి, రెండో వారంలో పాఠశాల స్థాయి, మూడో వారంలో జోనల్ స్థాయి (జిల్లా టీంల ఎంపిక) క్రీడలను నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా స్పోర్ట్స్ టోర్నమెంట్‌ను చేపట్టాలని కోరారు. అదేనెల నాలుగు వారంలో రాష్ట్ర స్థాయిలో స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించాలని తెలిపారు. డిసెంబర్ 22న రాష్ట్రస్థాయిలో మ్యాథమెటిక్స్ సెమినార్‌ను జరపాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28న రాష్ట్రస్థాయిలో సైన్స్ సెమినార్‌ను నిర్వహించాలని సూచించారు.

ఇథనాల్ వ్యతిరేక ఆందోళనపై సర్కార్ నిర్బంధకాండ

- అరెస్ట్ చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న రైతులపై సర్కార్ నిర్బంధ కాండను కొనసాగిస్తోందని, అక్రమంగా అరెస్ట్ చేసిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భాగం హేమంతరావు, పశ్యపద్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలని సంబంధిత గ్రామాల రైతులు ఏడాదిగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇథనాల్ ఉత్పత్తికి కేంద్రం అనుమతివ్వడాన్ని ప్రజావ్యతిరేక చర్యగా వారు అభివర్ణించారు. గత బిఆర్ఎస్ సర్కార్ కేంద్రం ఆదేశాలను పాటిస్తూ రాష్ట్రంలో ఇథనాల్ పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని విమర్శించారు. బియ్యం, మొక్కజొన్న తదితర పంటలతో ఇథనాల్ తయారు చేస్తే భవిష్యత్‌లో ఆహార కొరత ఏర్పడే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వీటి నుంచి వెలువడే వ్యర్థాలు పంటలపై విషపూరితమైన ప్రభావం చూపడంతో పాటు పర్యావరణం దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వెంటనే వీటి అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల జాబితా సవరణకు సన్నద్ధంకండి

- జిల్లా కలెక్టర్లు, ఇఆర్‌ఒలకు సిఇఒ సి సుధర్శన్ రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల జాబితా సవరణకు సన్నద్ధం కావాలని తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి. సుధర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారుల (ఇఆర్‌ఒల)తో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ల అధునీకరణ, ఖాళీ పోస్టుల భర్తీ, అధికారుల శిక్షణపై దృష్టి సారించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలననుసరించి, 1,200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను ఆధునీకరించాలని, ఓటర్ల సౌలభ్యం కోసం హై-రైజ్ భవనాలు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, గుడిసెల సమీపంలో కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. ఈఆర్‌వోలు, సహాయ ఈఆర్‌వోలు, బూత్ లెవెల్ అధికారుల (బీఎల్‌వోల) ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ, కొత్తగా ఏర్పాటయ్యే పోలింగ్ స్టేషన్ల కోసం అదనపు బీఎల్‌వోలను నియమించాలని ఆదేశించారు. ఎన్నికల చట్టాలు, ఐటీ వ్యవస్థలు, ఇంటింటి సర్వేలపై అధికారులకు సమగ్ర శిక్షణ ఇవ్వాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి అరెస్టు

- రైతులను పరామర్శించడానికి వెళితే అదుపులోకి తీసుకున్న పోలీసులు
- దాడికి పురికొల్పిన యాజమాన్యంపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అనుమతులను ప్రభుత్వం రద్దుచేయాలి
- విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడిన రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని వారి కుటుంబాలను పరామర్శించడానికి వెళుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని గద్వాల పట్టణ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రాజోలి మండలం పెద్ద దన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పన్నెండు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే తమకు నష్టం జరుగుతోందని, వెనక్కు తీసుకోవాలని కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. అయినా లెక్కచేయకుండా అదేపనిగా ముందుకు వెళ్లడాన్ని చుట్టూపక్కల గ్రామాల ప్రజలు నిరసించారు. రైతులపై దాడికి దిగారు. ఈ ఘటనలో 42 మంది రైతులపై అక్రమంగా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడంతో పాటు 12 మంది రైతులను అరెస్టు చేసి జైల్లో ఉంచారు. బెయిల్ కూడా రాలేదు. ఈ నేపథ్యంలో ఆ రైతు కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పడం కోసం సిపిఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో సిపిఎం నేతలు పెద్ద ధన్వాడకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వారిని మార్గమధ్యలోనే అడ్డుకుని పోలీసులు సిపిఎం నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

నిరసన చేస్తున్న తెలుపుతున్న సిపిఎం నాయకులు

అనంతరం జాన్‌వెస్లీ మీడియాతో మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలకు విరుద్ధంగా బలవంతంగా ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు పూనుకుంటున్న యాజమాన్యంపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చేశారు. అదే కాంగ్రెస్ పార్టీ దగ్గరుండి రైతులపై దాడులు చేయించి అక్రమ కేసులు బనాయించి వాళ్ళని జైలుపాలు చేశారని విమర్శించారు. మంచి పంటలు పండే వ్యవసాయ అనుకూలమైన భూములను అక్రమంగా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు విమర్శించారు. పరిశ్రమ ఏర్పాటు వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలి మండలంలో ఇండ్లు కోల్పోయిన ప్రజలకు సంబంధించిన ప్లాట్లను అక్కడే ఇచ్చారన్నారు. పరిశ్రమ ఏర్పాటు వల్ల వారు కూడా నిరాశ్రయు లవుతారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియంతృత్వ వైఖరి వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ప్రశ్నించినందుకు పరిశ్రమ యాజమాన్యం ప్రయివేటు బౌన్సర్లతో దాడులు చేయించిందని మరి యాజమాన్యంపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. మమ్మల్ని అడ్డుకుంటేనే ప్రజలను జైలుపాలు చేస్తేనో ఉద్యమాలు ఆగుతాయనుకోవడం ప్రభుత్వ అవివేకం అన్నారు. తక్షణమే ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అనుమతులు రద్దుచేసి రైతులపై అక్రమ కేసులను ఎత్తివేసి వారిని జైలు నుంచి విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులను ప్రజలను కలుపుకొని దీర్ఘకాల పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాం నాయక్ , జిల్లా కార్యదర్శి ఎ వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పరంజ్యోతి, ఈదన్న ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిని అఖిల పక్ష నాయకులు నాగరొడ్డి వెంకట రాములు, అతికూర్ రెహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పరామర్శించారు.

ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, ఇది సరైన పద్ధతి కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ ఎదుట హాజరుకావడానికి ముందు సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేటలోని తన నివాసం వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం విద్వేషంతో ఆలోచన చేయొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమపై కక్షతో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ, చట్టాలు, రాజ్యాంగం మీద బీఆర్ఎస్ పార్టీకి అపారమైన నమ్మకం ఉందని తెలిపారు. అందుకే కమిషన్ ఎదుట హాజరవుతున్నట్టు చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉండడంతో తమ వద్ద కొన్ని డాక్యుమెంట్స్ మాత్రమే ఉన్నాయని, ప్రభుత్వంలో లేము కాబట్టి అందుబాటులో ఉన్నటువంటి డాక్యుమెంట్లను కమిషన్‌కు అందిస్తామన్నారు.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ పొలంలో నీటి నిల్వకు తీసుకున్న గుంతలో పడి ఇద్దరు పిల్లలు (అన్నదమ్ములు) మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన పల్లిలో సోమవారం జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుంభం ధరణి, సుధాకర్ దంపతులకు అశ్విత్ కుమార్ (8), చేతన్ (6) తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లారు. తల్లిదండ్రులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. ఇద్దరు అన్నదమ్ములు సమీపంలోని పొలం దగ్గర ఆడుకుంటున్నారు. పని ముగించుకుని వచ్చిన తరువాత తల్లిదండ్రులు పిల్లలు కనిపించడం లేదని చుట్టూ వెతకగా నీటిగుంతలో పడివున్నారు. ఒక్కసారిగా తల్లిదండ్రులు ఆ దృశ్యం చూసి కొద్దిసేపు షాక్‌కు గురైరయ్యారు. బోరున విలపించారు. ఇద్దరు అన్నదమ్ములు ఒకే కుటుంబంలో ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల కేంద్రంలో సోమవారం విఎం బంజర ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రామచంద్రరావు బంజర గ్రామ పంచాయతీ కార్యదర్శి మాలోతు సోనాలి (26) దుర్మరణం చెందారు. మాలోతు సోనాలి మండల పరిధిలోని లక్ష్మా తండా నుంచి తన స్కూటీపై రామచంద్రరావు బంజరకు వస్తుండగా విఎం బంజర వద్ద లారీ ఢీ కొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు మూడేళ్ల కుమారుడు, ఏడాది బాబు ఉన్నాడు. పెనుబల్లి ఎస్ఐ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్వాంటం ఎనర్జీ తయారీ విస్తరణ

హైదరాబాద్ : ఇవి స్టార్టప్ క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ హైదరాబాద్ సమీపంలోని మహేశ్వరంలో తన అత్యాధునిక తయారీ సదుపాయాన్ని విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 లక్షల యూనిట్లను తయారు చేయనున్నట్లు పేర్కొంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచనున్నట్లు క్వాంటం ఎనర్జీ ఎండి చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. "మహేశ్వరంలోని మా తయారీ సదుపాయం విస్తరణ ఒక ముఖ్యమైన మైలురాయి. పర్యావరణ బాధ్యత కలిగిన అధిక నాణ్యత గల ద్విచక్ర వాహనాలను అంధించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము. " అని చక్రవర్తి పేర్కొన్నారు.

గౌలిదొడ్డి అలుగునూరు విద్యార్థుల తరలింపును ఉపసంహరించుకోవాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గౌలిదొడ్డి అలుగునూరు గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను 90 శాతానికి పైగా మార్కులు రాలేదనే సాకుతో వేర్వేరు కాలేజీలకు తరలించాలనే ఆ సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి తప్పుడు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తప్పుడు నిర్ణయాలతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దని ఆ సంస్థ కార్యదర్శికి హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం అక్కడే చదివిన విద్యార్థులకు 90 మార్కుల కంటే తక్కువ రావటాన్ని సవాల్ గా స్వీకరించి 100 శాతం మార్కులు సాధించడానికి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. కానీ..అక్కడ నుండి గెంటెయ్యడమేంటని ప్రశ్నించారు. ఒక విద్యా సంవత్సరం ఒకచోట, రెండో విద్యా సంవత్సరం మరోచోట చదవడం వల్ల విద్యార్థులు నానా రకాల ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు.

బస్సు ఢీకొని తాత మనువడు మృతి

- కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టీసీ బస్సు ఢీకొని తాత మనువడు మృతిచెందిన విషాద ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని పెద్దాయిపల్లి గేటు వద్ద జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బసవన్నపల్లి గ్రామానికి చెందిన దోమకొండ నడిపి సిద్ధ రాములు (50) తన మనువడు శ్రీహస్ (4)కు ఆదివారం కుక్క కరవడంతో చికిత్స కోసం రాజంపేట్ మండల కేంద్రంలోని ఆస్పత్రికి ద్విచక్రవాహనంపై సోమవారం తీసుకెళ్లాడు. చికిత్స అనంతరం తిరిగి వస్తుండగా.. పెద్దాయిపల్లి గేటు వద్ద అతివేగంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. బస్సు ముందు టైరులో సిద్ధరాములు ఇరుక్కుపోయాడు. శ్రీహస్ వెనుకటైర్ల సమీపంలో పడిపోయాడు. తీవ్ర గాయాలవడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. డ్రైవర్‌ను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. తాతమనువడు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హైదరాబాద్‌లో హైలాండ్ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్ : కంటెంట్ ఇన్నోవేషన్ క్లౌడ్ సంస్థ అయిన హైలాండ్ తాజాగా హైదరాబాద్‌లో తమ నూతన కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఇది కంపెనీ ప్రపంచ విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. హైటెక్‌సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ ఆఫీసును సోమవారం యుఎస్ కాన్సుల్ జనరల్ హైదరాబాద్ జెన్నిఫర్ లార్సన్ లాంచనంగా ప్రారంభించారు. "కంటెంట్ ఇన్నోవేషన్ క్లౌడ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి, మా ఆసియా పసిఫిక్ కస్టమర్లకు పరివర్తన పరిష్కారాలను అందించడానికి హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి సాంకేతిక పర్యావరణ వ్యవస్థ అనువైన ప్రదేశంగా మారింది" అని హైలాండ్ సిటిఒ టిమ్ మెక్‌ఇంటైర్ పేర్కొన్నారు.

దేశంలోనే తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు: చాడ వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) ఏర్పడిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో ఆ సంఘం 79 వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ... రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు కోసం ఎస్‌టియు చేసిన కృషి మరవలేనిదన్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగులను ఈ సందర్భంగా సన్మానించారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. పర్వత్ రెడ్డి, జి. సదానందం గౌడ్ మాట్లాడుతూ... సంఘం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించడంలో సంఘం కృషి చేసిందని వివరించారు. బడిబాట కార్యక్రమంలో సంఘ కార్యకర్తలు చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుదల కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జుట్టు గజేందర్, టి పోల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, పరమేశ, పున్న గణేష్, భార్గవి, అజర్ జహా, శంకర్ మతంగి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాంధీభవన్‌లో ప్రజా వినియోగ కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నది. ఇప్పటికే మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టిపిసిసి ప్రజా ప్రతినిధులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే మరో కార్యక్రమాన్ని మొదలు పెడుతోంది. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్మంగళవారం (జూన్ 10) నుంచి ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇద్దరు ప్రజా ప్రతినిధులు ఉండేలా కార్యక్రమాన్ని రూపొందించారు. మొదటి రోజు ఇద్దరు కార్పొరేషన్ చైర్మన్లు అందుబాటులో ఉంటారు. వారు ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించి ప్రభుత్వం చేత పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. నేటి కార్యక్రమానికి వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు ప్రజలకు అందుబాటులో ఉంటారు.

న్యాయం గెలిచింది: కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఎన్నిక చెల్లందంటూ వేసిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రజాక్షేత్రంలో గెలుపొందడం ద్వారా ప్రజా విజయం సాధించామని ఆయన తెలిపారు. తాజాగా అసంబంధమైన అంశాలతో వేసిన కేసును హైకోర్టు కొటేయడం ద్వారా న్యాయం గెలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుపై తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ ఈ తీర్పుతో న్యాయ వ్యవస్థ పట్ల మరింత విశ్వాసం, గౌరవం ప్రజల్లో పెరిగిందన్నారు.

ధాన్యం కొనుగోలుకు నిరాకరణ

- వరి బస్తాలను దహనం చేసే యత్నం
- పోలీసుల అడ్డగింపు.. బుజ్జగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసుకు సమస్యను తెలుపుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయడానికి నిరాకరించడంతో రైతు ఆగ్రహం చెందాడు.. ఏకంగా ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసి ధాన్యం దహనం చేసి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజిపేట గ్రామానికి చెందిన లూనావత్ భద్రు అనే రైతు తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 13 ఎకరాలను కౌలుకు తీసుకొని యాసంగిలో ధాన్యం పండించాడు. పది రోజుల క్రితం గ్రామంలో పిఎసిఎస్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యాన్ని తరలించారు. ధాన్యం కొనుగోలు చేయడానికి పలుమార్లు అధికారులు సెంటర్ వద్ద నిరాకరించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లానని రైతు భద్రు చెప్పాడు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారని, అయినా అధికారులు పట్టించుకోలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సహనం కోల్పోయిన రైతు సోమవారం నర్సంపేటలోని ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలను తీసుకెళ్లి దహనం చేసేందుకు ప్రయత్నించాడు.

పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. దహనం చేయవద్దని రైతును బుజ్జగించారు. కొను గోలు కేంద్రం బాధ్యులతో మాట్లాడారు.

ధాన్యం కొనుగోలు చేయడానికి చివరికి అంగీకరించడంతో రైతు శాంతించాడు. కాగా గంట పాటు క్యాంపు కార్యాలయం ఎదుట స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. చివరికి సర్వాపురంలోని ఎంజే ఆర్ రైస్ మిల్ వద్దకు రైతుకు చెందిన ధాన్యాన్ని తరలించారు. 900 బస్తాలు ధాన్యం దిగుబడి వచ్చిందని రైతు తెలిపారు.

విత్తనానికి విపత్తు

- బహుళజాతి సంస్థలకు కేంద్రం దన్ను
- తనకేం తెలీదన్న వ్యవసాయ మంత్రి
- అంతా తానై వ్యవహరిస్తున్న ఓ ఉన్నతాధికారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక విత్తనానికి విపత్తు రాబోతున్నదా? బహుళజాతి విత్తన సంస్థలు తెలంగాణలో పాగా వేయబోతున్నాయా? మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన కేంద్రం... దొడ్డిదారిలో మళ్లీ దేశానికి ఆయా సంస్థలను ఆహ్వానిస్తున్నదా? అందులో భాగంగానే హైదరాబాద్‌లో ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్స్ అండ్ కో ఆపరేషన్ డెవలంప్‌మెంట్ (ఒఇసిడి) సమావేశాలు జరుగుతున్నాయా? రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా తెలియకుండా ఈ సమావేశాలు జరుగుతున్నాయా? అంటే అవుననే అంటున్నారు వ్యవసాయ అధికారులు. ఐరోపా దేశాల కూటమి విభాగమైన ఓఈసీడీ సమావేశాలు హైదరాబాద్‌లో రహస్యంగా జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో విత్తన ధ్రువీకరణ సర్టిఫికేట్‌ను ఈ సంస్థ జారీ చేస్తుంది. దాని వార్షిక బడ్జెట్ రూ. 7వేల కోట్లు. అలాంటి ప్రయివేటు వ్యాపార సంస్థ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమవుతున్నాయి. పది రోజులపాటు అవి కొనసాగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాలకు విలాసవంతమైన హోటళ్లలో అతిథ్యమిస్తున్నది. అందుకు కావాల్సిన ఆర్థిక వనరులను కూడా సర్కారే సమకూర్చడం గమనార్హం. తమ విత్తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించడంలో భాగంగా ఈ సమావేశాలను ఆయా దేశాల్లో కంపెనీలు నిర్వహిస్తుంటాయి. స్థానిక విత్తనాలను దెబ్బతీయడం, కార్పొరేట్ల కంబంధ హస్తాల్లోకి విత్తనాలను తీసుకొచ్చే ప్రక్రియపై ఆ సమావేశాల్లో చర్చిస్తారు. అయితే ఈ సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఉంటుందనేది జగమెరిగిన సత్యం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలపై రైతాంగం తిరుగుబాటు చేసి వాటిని వెనక్కి కొట్టింది. ఆ చట్టాలు ఎంత ప్రమాదకరమో దేశానికి ఈ ఉద్యమంతో తెలిసింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాల నుంచి వెనక్కి తగ్గినట్టు కనిపించినా, ఇతర పద్ధతుల్లో వాటిని అమలు చేసేందుకు బహుళజాతి విత్తన సంస్థలను ఆహ్వానిస్తుందనే విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలో విత్తనంపై కార్పొరేట్ల పెత్తనం కొనసాగుతున్న నేపథ్యంలో ఓఈసీడీ సమావేశాలు అందుకు మరింత ఊతమిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని విత్తన రైతులకు అదరణ కరువైంది. రైతులను సర్కార్ ఆదుకోవడం లేదు. దాంతో వారు అన్ని విత్తనాలను మార్కెట్లలో కొనాల్సి వస్తుంది. విత్తనాల డిమాండ్‌ను ఆసరా చేసుకుని బహుళ జాతి కంపెనీలు అధిక ధరలకు విత్తనాలను అమ్ముకుంటూ వేల కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. వారు సరఫరా చేసిన విత్తనాలతో నష్టపోతే రైతుకు పరిహారం చెల్లించడం లేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బహుళజాతి సంస్థలకు అండగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నదని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఇప్పటికే రైతులపై సాగు భారం పెరిగి అప్పులపాలవుతుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం అందడం లేదు. విత్తన మార్కెట్‌ను బహుళజాతి సంస్థలు కమ్మేస్తే సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితులు దాపురించడం ఖాయం.

రాష్ట్ర ప్రయోజనాలకు భిన్నంగా జరుగుతున్న ఈ సమావేశాలు గురించి వ్యవసాయ శాఖ మంత్రికి కూడా తెలియదని సచివాలయవర్గాలు చెప్పాయి. అయితే విత్తనాభివృద్ధి సంస్థే ఓఈసీడీ సమావేశాలకు రెడ్ కార్పెట్ వేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సంస్థ ఉన్నతాధికారి వ్యక్తిగతంగా తన ప్రతిష్టను పెంచుకునేందుకు ఇలాంటి రైతు వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే టాక్ కూడా వినిపిస్తున్నది. ప్రయివేటు వ్యాపారుల ప్రయోజనాల కోసం ప్రభుత్వ సొమ్మును దుబారా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

మహారాష్ట్ర, సిడబ్ల్యుసి అభ్యంతరాలతోనే రీడిజైన్

- కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సిడబ్ల్యుసి లేఖలు అన్నీ సమర్పించడం జరిగిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బిఆర్‌కె భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా పిలవడం జరిగిందనీ, కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని తెలియజేశారు. ఆధారాలతో సమాధానాలను కమిషన్‌కు అందచేశానని చెప్పారు. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయాలు ఏమైనా ఉంటే రేపు మాట్లాడుకుందామనీ, లోపట ఒకటి చెప్పి బయట ఒకటి చెప్పడం తప్పవుతుందని అభిప్రాయపడ్డారు.

తమ్మిడిహట్టిపైనే విచారణ

ప్రారంభంలో తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీని ఎందుకు మార్చారనే అంశంపై చాలాసేపు చర్చించాం. దానికి నేను కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాం. ఇరిగేషన్ మంత్రిగా రివ్యూ చేసినప్పుడు ప్రాణాహిత ప్రాజెక్టు 7 ప్యాకేజీలు 27 భాగాలుగా టెండర్లను పిలిచింది గత కాంగ్రెస్ ప్రభుత్వం. తల పనులు స్టార్ట్ చేయకుండా తోక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వింది అని హరీశ్‌రావు తెలిపారు.

152 మీటర్ల ఎత్తులో నిర్మాణం వద్దన్నారు

మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నెలకే వెళ్లి కలవడం జరిగింది. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వండని అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను కోరడం జరిగింది. ఇరిగేషన్ మంత్రిగా ఉన్నటువంటి హసన్ ముష్రఫ్.. చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి ఈ ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మించడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని కూడా కమిషన్ దృష్టికి తీసుకు వెళ్లామని హరీశ్‌రావు తెలిపారు.

తమ్మిడిహట్టి కోసం ఐదారు భేటీలు

మహారాష్ట్ర, తెలంగాణ మధ్య తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్ జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి మళ్లీ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలనీ, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరడం జరిగింది. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిశారు. ఏడేండ్లు మాకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ పార్టీ తరపున ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేసింది తానేనని ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు పర్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని ఫడ్నవీస్ తేల్చి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో ..

కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏడు సంవత్సరాలు అధికారంలో ఉంటే ఒక్క అనుమతి కూడా సాధించలేదు. ఒక్క అంత:రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. ఒక గుంట భూమిని కూడా సేకరించలేదు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పట్టించుకోలేదు. సెంట్రల్ వాటర్ కమిషన్ తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు అని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసింది. అదేవిధంగా సీడబ్ల్యూసీ తమ్మిడిహట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థ్యం కూడా సరిపోదనీ, సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని ఉత్తరం రాసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ని బ్యారేజీ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరడం జరిగింది. కేంద్ర సంస్థ వాప్కోస్ లాడార్ సర్వే చేసి, ఎగ్జామిన్ చేసి మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉంది అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చని తెలిపింది. వాప్కోస్, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజినీర్ల సూచన మేరకు మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది అని హరీశ్‌రావు తెలిపారు.

నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడేండ్లుగా పొరుగు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేదు. అదేవిధంగా మహారాష్ట్రలో ముంపుకు గురవుతున్న చోట చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉంది. వైల్డ్ లైఫ్ అనుమతులు లభించాలంటే కనీసం 10 సంవత్సరాలు సుప్రీంకోర్టులో కొట్లాడాల్సి వస్తుంది. నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే నీళ్లు ఉన్నచోట ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించడం జరిగింది. అన్ని రకాల ఆధారాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసిన ఉత్తరాలు, జీవోలు అన్నీ కమిషన్‌కు సమర్పించడం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాళేశ్వరం కార్పొరేషన్‌కి అనుమతి ఉందా..?

కాళేశ్వరం కార్పొరేషన్‌కి అనుమతి ఉందా అని అడిగారు. కాళేశ్వరం కమిషన్‌కు స్పష్టంగా అనుమతి ఉన్న విషయాన్ని అన్ని ఆధారాలతో సమర్పించడం జరిగింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ మార్పుల గురించి అడిగారు. అది పూర్తిగా టెక్నికల్ నిర్ణయం. ఇంజనీర్ల డీటెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లొకేషన్ మారింది. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తీసుకునే నిర్ణయమని చెప్పాను. దేశంలో ఇలా అనేక ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో జరుగుతుంది వాటికి సంబంధించిన ఆధారాలు కూడా కమిషన్‌కి సమర్పించడం జరిగిందన్నారు హరీశ్‌రావు.

కూళేశ్వరం అని అంటున్నారు..

ఇక ఈ ప్రాజెక్టులో రిజర్వాయర్లకు కెపాసిటీ ఎంత అని కమిషన్ చైర్మెన్ అడిగారు. 141 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించామని చెప్పడం జరిగింది. కాళేశ్వరంపై పిచ్చికూతలు కూస్తూ కూళేశ్వరం అని మాట్లాడుతున్నారు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉన్నాయి. అన్ని ఇంటెక్ట్ ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టిఎంసీల నీటి వినియోగం.. పూర్తిగా ఇవన్నీ ఇంటాక్ట్ ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు.

మల్లన్న సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం..

ముఖ్యమంత్రి గంధమల్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు నీళ్లు మల్లన్న సాగర్ నుంచి పోతాయి. మల్లన్న సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం. హైదరాబాద్ మూసీ సుందరీకరణకు మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తరలిస్తామంటున్నారు. ఆ మల్లన్న సాగర్ కాళేశ్వరంలో అంతర్భాగం. అదేవిధంగా హైదరాబాద్‌కు తాగునీటిని మల్లన్న సాగర్ నుంచి ఇస్తామంటున్నారు అది కాళేశ్వరంలో భాగం కాదా. మల్లన్న సాగర్ పై ఆధారపడ్డ గంధమల్లకు టెండర్లు పిలిచి శంకుస్థాపన చేస్తారు. మరో పక్క కాళేశ్వరం కూలింది అని దుష్ప్రచారం చేస్తారని హరీశ్‌రావు మండిపడ్డారు.